
కోటితీర్థం.. ప్రగతి ధామం

రూ.1.80 కోట్ల అభివృద్ధి పనులు

- గ్రామానికి మౌలిక వసతుల ఏర్పాటు
- ఆనందం వ్యక్తం చేస్తున్న ప్రజలు

కోటితీర్థం.. చిన్న పల్లెటూరు. ఉరకలెత్తి ప్రవహించే పెన్నానది చెంతనే కొలువైన శైవక్షేత్రం. చుట్టూ పచ్చని పొలాలు, ఏపుగా పెరిగిన తోటలు ఆ ఊరు అందాలు స్వర్గ సీమను తలపిస్తోంది. అయితే దశాబ్దాలుగా ఎలాంటి మౌలిక వసతులు లేక ఆ ఊరు అన్నీ ఉన్నా.. అల్లుడు నోట్లో శని అన్నట్లుగా అభివృద్ధికి దూరంగా ఉంది. గడిచిన ఐదేళ్లలో అత్యాధునిక సచివాలయం, విలేజ్ హెల్త్ క్లినిక్, ఆర్బీకే, పట్టణాల్లోనే కనిపించే సుందరమైన పార్కు, సిమెంట్ రోడ్లతో ఇలా ఆ పల్లె ప్రగతికి ధామంగా మారింది.

చేజర్ల: జిల్లాలో ప్రసిద్ధ శైవ పుణ్యక్షేత్రాల్లో ఒకటైన కోటేశ్వరాలయం కొలువైన కోటితీర్థం. సుమారు 780 మంది జనాభా ఉన్న ఈ చిన్న పల్లె పక్కనే పెన్నానది ప్రవహిస్తుండడంతో చుట్టూ మనస్సు మైమరిపించే పొలాలు, తోటలతో అలరారుతోంది. అటువంటి చిన్న పల్లె పట్టణాలకు దీటుగా ప్రభుత్వ పరిపాలన, వైద్య సేవల భవనాలతో పాటు ఆధునిక మౌలిక వసతులతో సర్వాంగ సుందరంగా తయారైంది. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గడిచిన ఐదేళ్లలోనే రూ.180 కోట్లతో అభివృద్ధి పనులు చేశారు. గ్రామంలో ప్రధానమైన అంతర్గత రోడ్లను రూ.20 లక్షలతో సిమెంట్ రోడ్లుగా అభివృద్ధి పరిచారు. తాజాగా రూ.8 లక్షలతో మరికొన్ని సిమెంట్ రోడ్లను నిర్మించారు. ప్రధానంగా గ్రామ స్వరాజ్య పరిపాలనకు చిహ్నమైన రూ.35 లక్షలతో సచివాలయం, రూ.15.70 లక్షలతో విలేజ్ హెల్త్ క్లినిక్, రూ.21.80 లక్షలతో ఆర్బీకే నిర్మించారు. వీటి ద్వారా ప్రజలకు అవసరమైన సేవలను అందిస్తున్నారు. గ్రామ ప్రజలు ఆహ్లాదకరమైన వాతావరణం, వసతులతో యోగా, వాకింగ్ ట్రాక్‌తో రూ.2.8 లక్షలతో విలేజ్ పార్క్‌ను నిర్మించారు. పట్టణా ల్లోనే కనిపించే పార్క్‌లను సైతం గ్రామీణ ప్రాంతాల్లో ఏర్పాటు చేయడంతో గ్రామ ప్రజల మన్ననలు పొందుతున్నారు. గ్రామ ప్రజల తాగునీటి అవసరాల కోసం వాటర్ ట్యాంక్‌కు రూ.4.5 లక్షలతో మరమ్మతులు చేయించారు. సుమారు రూ.35 లక్షలతో నిర్మించిన గంగిరెడ్డి కాలువ బ్రిడ్జిని పూర్తి చేశారు. స్వచ్ఛభారత్ షెడ్‌ను పూర్తి చేశారు. గడప గడపకు మన ప్రభుత్వం నిధులతో ఆర్‌ఓ ప్లాంట్‌ను అందుబాటులోకి తెచ్చారు. గత టీడీపీ ప్రభుత్వంలో వృద్ధాప్య పింఛన్, పొలాలకు సంబంధించిన పాస్‌బుక్‌లు పొందాలంటే మండల కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వచ్చేదని.. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సీఎం అయ్యాక ఎక్కడికి పోకుండానే అన్ని వసతులు పల్లె గడప దాటకుండానే లభిస్తున్నాయని గ్రామస్తులు అభిప్రాయపడ్డారు.


వాటర్ ట్యాంక్


కోటితీర్థంలో ఏర్పాటు చేసిన విలేజ్ పార్క్

ఇది కదా.. అభివృద్ధి


ఇటీవల వేసిన సిమెంట్ రోడ్డు

మౌలిక వసతులతో మా ఊరు బాగుపడింది



వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్ర ముఖ్యమంత్రి అయిన తర్వాత గ్రామానికి కావాల్సిన మౌలిక వసతులు ఏర్పాటు అయ్యాయి. తాగునీటి అవసరాలతో పాటు, రోడ్డు సౌకర్యం కల్పించారు. సచివాలయాల ద్వారా ప్రజలకు అవసరమైన సేవలు అందుతున్నాయి. ఆర్బీకేల ద్వారా రైతులకు అవసరమైన ఎరువులు, రైతు సమాచారం తెలుసుకొంటున్నామన్నారు.

– మేకా మధుసూదన్ నాయుడు, కోటితీర్థం, చేజర్ల మండలం

పార్క్ నిర్మాణం ఆనందంగా ఉంది



మా ఊరు మారుమూల పల్లెటూరు. పట్టణాలకంటే అన్ని వసతులతో దీటుగా అభివృద్ధి చెంది. చిన్న పల్లెలో పార్క్ ఏర్పాటు చేయడం చాలా సంతోషంగా ఉంది. పట్టణాలకే పరిమితమైన పార్క్‌లు గ్రామీణ ప్రాంతాల్లో ఏర్పాటు చేశారు. సాయంత్రం వేళ ఆహ్లాదంగా యోగాసనాలు, వాకింగ్ ట్రాక్ ఉంది. వృద్ధులు సాయంత్రం ప్రశాంతంగా సేద తీరేందుకు ఎంతగానో ఉపయోగ పడుతుందన్నారు.

– గమతంబోయిన నాగేశ్వరరావు, కోటితీర్థం, చేజర్ల మండలం

నేడు సంగంలో విజయీభవయాత్ర

సంగం: మండలంలోని తలుపూరుపాడు, కొరిమెర్లలో సోమవారం ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి విజయీభవ యాత్ర నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పులగం శంకర్‌రెడ్డి ఆదివారం తెలిపారు. సోమవారం మధ్యాహ్నం 3.30 గంటలకు తలుపూరుపాడు, సాయంత్రం 5.30 గంటలకు కొరిమెర్ల గ్రామాల్లో విజయీభవయాత్ర జరుగుతుందన్నారు. మండలంలోని నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజాప్రతినిధులు జయప్రదం చేయాలని కోరారు.

నేడు విజయ సంకల్ప యాత్ర

వరికుంటపాడు: మండలంలోని యర్రంరెడ్డిపల్లి, తోటలచెరువుపల్లి, పెద్దిరెడ్డిపల్లి పంచాయతీల్లో సోమవారం ఉదయగిరి సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డి విజయ సంకల్పయాత్ర నిర్వహిస్తారని స్థానిక నాయకులు తెలిపారు. ఈ విజయ సంకల్పయాత్ర కార్యక్రమానికి మండలంలోని నాయకులు, కార్యకర్తలు, అభిమానులు విజయవంతం చేయాలని కోరారు.

నేడు యాదవ చైతన్య వేదికకు శంకుస్థాపన

ఉదయగిరి: దుత్తలూరు-నర్రవాడ గ్రామాల మధ్యలో 565వ జాతీయ రహదారికి సమీపంలో యాదవ చైతన్య వేదిక నిర్మాణానికి వేద పండితుల ఆధ్వర్యంలో భూమి పూజ కార్యక్రమం నిర్వహించనున్నట్లు స్థల దాత జెడ్పీటీసీ మోది రామాంజనేయులు యాదవ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. రాజ్యసభ సభ్యుడు బీద మస్తాన్‌రావు, పలువురు ప్రజాప్రతినిధులు, ప్రముఖులు హాజరవుతారన్నారు. యాదవ సోదరులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

నేడు టెక్ ఫెయిర్ ప్రారంభం

ఆత్మకూరు: స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో సోమవారం 8, 9, 10 తరగతుల విద్యార్థినీ, విద్యార్థులకు సాంకేతిక విద్యపై అవగాహన కల్పించే టెక్ ఫెయిర్‌ను ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి ప్రారంభించనున్నట్లు ఎమ్మెల్యే కార్యాలయ ప్రతినిధులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి శ్రీధర్‌గార్డెన్స్‌లో నిర్వహించే వలంటీర్లకు వందనం కార్యక్రమాన్ని ప్రారంభిస్తారన్నారు.

క్లుప్తంగా

ఉత్సవ విగ్రహాలకు పంచామృతాభిషేకాలు


హోమం నిర్వహిస్తున్న భక్తులు

వరికుంటపాడు: వరికుంటపాడులో నూతనంగా నిర్మించిన శ్రీపద్మావతి, శ్రీగోదాదేవి సమేత శ్రీ వెంకటేశ్వరస్వామి నూతన ఆలయంలో గురువారం నుంచి జరగనున్న విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవాల్లో భాగంగా ఆదివారం ఉత్సవ విగ్రహాలకు పంచామృతాభిషేకాలు నిర్వహించారు. రుత్వికులు ముందుగా అభిషేక హోమాలు నిర్వహించి పెద్ద ఎత్తున పూజలు చేశారు. మహాశాంతి స్థాపనం, విమాన కలశ స్థాపన, తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

గౌతమ్‌రెడ్డి వర్ధంతి ఏర్పాట్ల పరిశీలన


ఏర్పాట్లు పరిశీలించి సూచనలిస్తున్న రాజగోపాల్‌రెడ్డి

ఉదయగిరి: స్థానిక ప్రభుత్వ వ్యవసాయ కళాశాలలో బుధవారం నిర్వహించే దివంగత మంత్రి మేకపాటి గౌతమ్‌రెడ్డి రెండో వర్ధంతి కార్యక్రమం ఏర్పాట్లను ఆదివారం వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డి పరిశీలించారు. సభా వేదిక, భోజన ఏర్పాట్లపై నాయకులు, నిర్వాహకులతో ఆయన చర్చించారు. ఈ కార్యక్రమంలో కళాశాల అసోసియేట్ డీన్ టి.గోపీకృష్ణ, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు జి.ఓబుల్‌రెడ్డి, జెడ్పీ కో–ఆప్షన్ సభ్యుడు గాజుల తాజుద్దీన్, నాయకులు శ్రీనివాసులురెడ్డి, అక్కి భాస్కర్‌రెడ్డి తదితరులున్నారు.

నిరుపేద కుటుంబాన్ని ఆదుకున్న హెల్పింగ్ హార్ట్స్

సోమశిల: అనంతసాగరం మండలం పడమటి కంభంపాడు ఎస్సీ కాలనీకి చెందిన నిరుపేద కత్తి వెంకటరమణయ్యకు ఆదివారం హెల్పింగ్ హార్ట్స్ సభ్యులు రూ.20 వేలు ఆర్థిక సహాయం అందజేశారు. కొన్నేళ్ల నుంచి లివర్ ఫెయిల్యూర్, పచ్చ కామెర్ల వ్యాధితో బాధపడుతూ ఆరోగ్యం పూర్తిగా క్షీణించిపోయింది. ఆర్థిక ఇబ్బందులతో ఆస్పత్రిలో వైద్యుల వద్దకు వెళ్లేందుకు ఇబ్బందులు పడుతుండడంతో గ్రామస్తులు హెల్పింగ్ హార్ట్స్ అసోసియేషన్ దృష్టికి తీసుకెళ్లారు. ఆ కుటుంబ పరిస్థితిని తెలుసుకున్న సంస్థ సభ్యులు వైద్య ఖర్చుల నిమిత్తం ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో హెల్పింగ్ హార్ట్స్ సెక్రటరి కత్తి పెంచలయ్య, వార్డు సభ్యులు సత్యాల పెంచలమ్మ, కత్తి సురేష్, కత్తి చిన్నయ్య, కత్తి రవి, నాగిపోగు శివయ్య, నాగిపోగు మల్లే, తిరుపాలు, దండు రమేష్ పాల్గొన్నారు.

కారు ఢీకొని వ్యక్తికి తీవ్రగాయాలు


ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రామయ్య

దుత్తలూరు: ఎదురుగా వస్తున్న కారు బైక్‌ను ఢీకొనడంతో ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఘటన మండలంలోని నందిపాడు సమీపంలో 565వ జాతీయ రహదారిపై ఆదివారం జరిగింది. ఉదయగిరి మండలం జి.చెర్లోపల్లి వడ్డిపాళెం చెందిన బత్తుల రామయ్య, తన భార్యతో కలిసి బైక్‌పై నందిపాడు వెళ్లాడు. కస్తూర్బాగాంధీ పాఠశాలలో చదువుతున్న తన కుమార్తెను చూసి తిరిగి స్వగ్రామం వెళుతుండగా ఎదురుగా వస్తున్న కారు ఢీకొంది. ఈ ఘటనలో రామయ్యకు తల, ఎడమ కాలికి తీవ్రగాయాలు కావడంతో ఆయన్ను చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు.

భగవద్గీతపై ప్రచారం

అల్లూరు: మాఘ పౌర్ణమి, రథ సప్తమి, శివరాత్రి పండగల ప్రత్యేకతపై త్రైత సిద్ధాంత భగవద్గీతపై మండలంలోని సింగపేట, వెలిచర్ల గ్రామాల్లో ఆదివారం ప్రచారం నిర్వహించారు. గ్రామాల్లో ప్రతి ఇంటింటికీ తిరిగి ప్రచారం నిర్వహించారు. త్రైత సిద్ధాంతం ప్రబోధ సేవా సమితి ఇందూ జ్ఞానవేదిక జిల్లా కమిటీ అధ్యక్షుడు, డి సుర మౌళి, సభ్యులు ప్రదీప్, సందరరాజా, కృష్ణ, రామయ్య, మహేంద్ర, విజయమ్మ, సుమలత, డీవీ ప్రసాద్, శేఖర్, కోటేశ్వరరావు, పద్మజ, నరసింహ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

వెలవెలబోయిన చికెన్ దుకాణాలు

సంగం: జిల్లాలో బర్డ్‌ఫ్లూ వైరస్ కలకలం నేపథ్యంలో కొన్ని ప్రాంతాల్లో చికెన్ విక్రయాలు పూర్తిగా నిలిపివేశారు. సంగంలో చికెన్ దుకాణాలు ఆదివారం వెలవెలబోయాయి. చికెన్ కొనేవారు రాకపోవడంతో దుకాణాలు ఖాళీగా దర్శనమిచ్చాయి. చేపలు, మటన్ దుకాణాలు కళకళలాడాయి. ఉదయం నుండే మాంసాహార ప్రియులు మటన్, చికెన్ దుకాణాల వద్ద బారులు తీరారు.

ఐదేళ్లలో పేదరికం తగ్గుముఖం

- రాబోయే ఐదేళ్లలో గ్రామాలను సస్యశ్యామలం చేస్తాం
- ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి
- వివిధ అభివృద్ధి పనులు ప్రారంభం


విజయీభవయాత్రలో అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి

అనుమసముద్రంపేట: ఐదేళ్లు అధికారమిస్తే.. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో పేదరికం తగ్గుముఖం పట్టించారని, మరో దఫా అధికారమిస్తే పేదలు సమాజంలో ధనవంతులుగా మారుతారని ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి చెప్పారు. దేశంలోని ప్రముఖ ఆర్థిక గణాంక సంస్థలు వెల్లడించాయన్నారు. ఇందులో వాస్తవం కూడా ప్రగతి సాధించిన పేదలకే తెలుసన్నారు. రాబోయే ఐదేళ్లలో ఆత్మకూరు నియోజకవర్గంలోని ప్రతి గ్రామాన్ని సస్యశ్యామలం చేస్తామని హామీ ఇచ్చారు. మండలంలోని గుంపర్లపాడు, అక్బరాబాదు గ్రామాల్లో ఆదివారం విజయీభవయాత్ర నిర్వహించారు. ముందుగా అక్బరాబాదులో రూ.17.50 లక్షలతో, గుంపర్లపాడులో రూ.20 లక్షలతో నిర్మాణం పూర్తయిన సీసీ రోడ్లను, సచివాలయ నూతన భవనం, వైఎస్సార్ విలేజ్ క్లినిక్ భవనాలను ఎమ్మెల్యే మేకపాటి ప్రారంభించారు.

గత పాలనకు.. ఈ ప్రభుత్వ పాలనకు తేడాలివే..

వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక మేనిఫెస్టో హామీలను సంపూర్తిగా అమలు చేయడంతో పాటు చెప్పనివి కూడా అమలు చేసిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిదని ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి చెప్పారు. సంక్షేమంతో పాటు అభివృద్ధిలో రాష్ట్రం ఎంతో ముందుకుపోతుందన్నారు. సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేసి వలంటీర్లను నియమించి ప్రతి గడపకు సంక్షేమ పథకాలు అందేలా చేస్తున్నారన్నారు. ఇది నచ్చని టీడీపీ వాళ్లు సచివాలయం, వలంటీర్ల వ్యవస్థలపై బురద చల్లుతున్నారన్నారు. గత ప్రభుత్వ హయాంలో జన్మభూమి కమిటీలు ప్రజలను దోచుకున్నాయని, టీడీపీ కార్యకర్తలకే ప్రభుత్వ పథకాలను అందించిన విషయాన్ని గుర్తు చేశారు. గత ప్రభుత్వం మేనిఫెస్టోను పూర్తిగా పక్కన పెట్టేశారన్నారు. ప్రజాసంక్షేమానికి, అభివృద్ధికి సమాన ప్రాధాన్యత ఇస్తూ పాలన సాగించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి రానున్న కాలంలో మరింత సంక్షేమాన్ని ప్రజలకు అందజేస్తారన్నారు. సంక్షేమాభివృద్ధి కింద అక్బరాబాద్, గుంపర్లపాడు పంచాయతీలకు రూ.19.85 కోట్లు నిధులు అందజేశారన్నారు. రెవెన్యూ వ్యవస్థలో తీసుకొచ్చిన సంస్కరణలతో 243 మంది రైతులకు లబ్ధి చేకూరిందని, 110 మంది లబ్ధిదారులకు రూ.2.70 కోట్లతో సొంతింటి కలను నిజం చేసేందుకు ఖర్చు చేశామని, సొంత స్థలం కలిగిన వారికి రూ.10 లక్షలు అందజేశామన్నారు. వైఎస్సార్ జలకళ పథకం ద్వారా 17 బోర్లు మంజూరు చేసినట్లు వివరించారు. రానున్న ఎన్నికల్లో ప్రజలంతా జగనన్ను ఆశీర్వదించి 175కు 175 స్థానాల్లో విజయం సాధించే విధంగా ఆశీర్వదించాలని కోరారు. ఈ సందర్భంగా అక్బరాబాద్‌లో పోలియోతో బాధపడుతూ వైద్య ఖర్చులకు, కుటుంబ జీవనానికి ఇబ్బందులు పడుతున్న శేషారెడ్డికి ఎమ్మెల్యే మేకపాటి సొంత నిధులు రూ.60 వేలు ఆర్థిక సహాయంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ బోయళ్ల పద్మజారెడ్డి, జెడ్పీటీసీ సభ్యులు పందిళ్లపల్లి రాజేశ్వరమ్మ, సొసైటీ చైర్మన్ ప్రభాకర్‌రెడ్డి, మాజీ చైర్మన్ నారసింహారెడ్డి, మండల కో ఆప్షన్ సభ్యులు షేక్ సంధాని, మాజీ కో ఆప్షన్ సభ్యుడు రియాజ్ అహ్మద్, జేసీఎస్ కన్వీనర్ పులిమి రమేష్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు జిలానీ, షౌకత్ ఆలీ, సర్పంచ్ వనిపెంట రంగారెడ్డి, వెంకురెడ్డి, ఎంపీటీసీ సభ్యులు స్వాతి, సిరిగిరి వెంకటేశ్వర్లురెడ్డి, కోటిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి


సమస్యలు అడిగి తెలుసుకుంటున్న మేకపాటి రాజగోపాల్‌రెడ్డి

- సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డి

ఉదయగిరి: నియోజకవర్గంలో తన దృష్టికి వచ్చిన ప్రజా సమస్యలు వెంటనే పరిష్కరించేందుకు కృషి చేస్తున్నానని వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డి అన్నారు. ఆయన ఆదివారం పట్టణంలోని శ్రీనగర్‌కాలనీ, మంగలికట్ట, యూనియన్ రోడ్డు వీధుల్లో రచ్చబండ కార్యక్రమం నిర్వహించారు. ఆయా ప్రాంత వాసులు పలు సమస్యలు ఆయన దృష్టికి తెచ్చారు. ఆయన స్పందించి తన ద్వారా అయ్యే సమస్యలు పరిష్కరించడంతో పాటు, అధికారుల ద్వారా పరిష్కరించే సమస్యలు త్వరితగతిన పరిష్కరించేలా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. ప్రభుత్వం ప్రజా సమస్యలను ప్రజా ప్రతినిధులు గ్రామాల్లో వారి వద్దకు వెళ్లి తెలుసుకుని పరిష్కరించేందుకే రచ్చబండ కార్యక్రమం నిర్వహిస్తుందన్నారు. మేకపాటి సోదరుల కుటుంబాలు సుమారు 40 ఏళ్లకు పైగా నియోజక వర్గ ప్రజలకు అందుబాటులో ఉండి వారితో మమేకమై ఉన్నామన్నారు. మా అన్న మేకపాటి రాజమోహన్‌రెడ్డి ఈ ప్రాంతంలో ప్రజలకు విద్య ఎంతో అవసరమని ప్రాథమిక పాఠశాలల స్థాయి నుంచి డిగ్రీ, ఇంజినీరింగ్, వ్యవసాయ కళాశాలల ఏర్పాటుకు ఎంతో కృషి చేశారని, ఆ విషయం ప్రజలు గమనించాలన్నారు. తమ కుటుంబం ప్రజలకు అందుబాటులో ఉండి వారికి అండగా ఉంటున్నామన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ గానుగపెంట ఓబుల్‌రెడ్డి, జెడ్పీ కో–ఆప్షన్ సభ్యుడు గాజుల తాజుద్దీన్, జేసీఎస్ కన్వీనర్ కె.కృష్ణారెడ్డి, నాయకులు అక్కి భాస్కరరెడ్డి, జి.తిరుపతి, గడియాల్చి ఎస్దానీ, జి.శ్రీనివాసులురెడ్డి, ఎండీ కరీం, దస్తగిరి అహ్మద్, జి.వెంగళరెడ్డి, ఎం.రామయ్య, లక్ష్మయ్య, దర్వేష్, ఎస్.ప్రసాద్, డి.చెన్నయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల సంఘం మార్గదర్శకాలు పాటించాలి

- నియోజకవర్గ ఆర్వో ప్రేమ్‌కుమార్


సెక్టారు అధికారులకు శిక్షణ ఇస్తున్న నియోజకవర్గ ఆర్వో ప్రేమ్‌కుమార్

ఉదయగిరి: త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి నియోజకవర్గంలో నియమించిన ఎన్నికల అధికారులు, సిబ్బంది ఎన్నికల సంఘం మార్గదర్శకాలను తప్పనిసరిగా పాటిస్తుండాలని నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి రాజారామేష్ ప్రేమ్‌కుమార్ తెలిపారు. ఆయన ఆదివారం ఉదయగిరిలోని మేకపాటి గౌతమ్‌రెడ్డి ప్రభుత్వ వ్యవసాయ కళాశాలలో సెక్టారు అధికారులు, పోలీసు అధికారులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ నియమించిన సిబ్బంది ఎన్నికలు ముగిసే వరకు ఎన్నికల కమిషన్ పరిధిలో ఉంటారన్నారు. శిక్షణలో ప్రతి అంశాన్ని తెలుసుకోవాలన్నారు. ఎన్నికల సంఘం జారీ చేసిన మార్గదర్శకాలు, నిబంధనలు బాగా చదువుకోవాలన్నారు. పోలింగ్ కేంద్రాల్లో అన్ని వసతులు కల్పించి ఓటర్లు స్వేచ్ఛగా ప్రశాంత వాతావరణంలో ఓటు హక్కు వినియోగించుకునేలా చూడాలన్నారు. ఎన్నికల విధులు బాధ్యతగా నిర్వహించాలన్నారు. పోలింగ్ కేంద్రాల్లో అన్ని వసతులు చూసుకోవాల్సిన బాధ్యత సెక్టారు అధికారులదేనన్నారు. ఈ కార్యక్రమంలో కావలి డీఎస్పీ వెంకటరమణ, ఉదయగిరి సీఐ గిరిబాబు, తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి

- ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి


నాయకులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి

మర్రిపాడు: ఆత్మకూరు పట్టణంలోని వార్డుల్లో అవసరమైన మౌలిక వసతులు కల్పించి అభివృద్ధి చేసేందుకు ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి అన్నారు. ఆదివారం బ్రాహ్మణపల్లిలోని మేకపాటి నివాసంలో ఆత్మకూరు మున్సిపల్ పరిధిలోని 17వ వార్డు వైఎస్సార్‌సీపీ నాయకులతో ఆత్మీయ అల్పాహార సమావేశాన్ని నిర్వహించారు. వార్డులో అవసరమైన అభివృద్ధి పనులతో పాటు, పార్టీ స్థితిగతులను నాయకులను అడిగి తెలుసుకున్నారు. సమష్టి భాగస్వామ్యంతో అభివృద్ధితో పాటు సమస్యలను పరిష్కరించుకుందామన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ సర్దార్, నాయకులు ఉన్నారు.

'ప్రైవేట్' విద్యార్థులకు ప్రోత్సాహకాలు


మాట్లాడుతున్న పరమేశ్వర రెడ్డి

ఆత్మకూరు: ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులు పదో తరగతి ఫలితాల్లో ఉత్తమ మార్కులు సాధించిన వారికి నగదు ప్రోత్సాహకాలు అందజేయనున్నట్లు పట్టణానికి చెందిన శ్రీసాంబశివ చారిటబుల్ ట్రస్ట్ నిర్వాహకుడు కంచి పరమేశ్వర రెడ్డి తెలిపారు. ఇప్పటికే ప్రభుత్వ పాఠశాలల పదో తరగతి విద్యార్థులకు మంచి మార్కులు సాధిస్తే నగదు నజరానాలు ప్రకటించిన విషయం తెలిసిందే. పట్టణంలోని ప్రగతి ఇంగ్లిష్ మీడియం పాఠశాలలో ఆదివారం పలు ప్రైవేట్ పాఠశాలల కరస్పాండెంట్లు, ఉపాధ్యాయులు, విద్యార్థులతో ట్రస్ట్ నిర్వాహకులు సమావేశం నిర్వహించారు. రానున్న పదో తరగతి పరీక్షల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ మార్కులు సాధించిన వారికి రూ.20 వేలు, 15 వేలు, 10 వేలు చొప్పున నగదు ప్రోత్సాహక బహుమతులు అందజేయనున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో కుడుముల సుధాకర్ రెడ్డి, ట్రస్ట్ సభ్యులు, విశ్రాంత హెచ్‌ఎం కేవీ శేషారెడ్డి, మోటివేటర్ నారాయణరావు, గోవిందరెడ్డి, యానాదిరెడ్డి, మేధా వెంకట సుబ్బయ్య, రామ్మోహన్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, కోటేశ్వరరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

శానిటేషన్, సెక్యూరిటీ సిబ్బంది నూతన కమిటీ ఎన్నిక


ఆత్మకూరు ప్రభుత్వ ఆస్పత్రి శానిటేషన్ సిబ్బంది నూతన కమిటీ సభ్యులతో సీఐటీయూ, సీపీఎం నాయకులు

ఆత్మకూరు: ఆత్మకూరు ప్రభుత్వ జిల్లా ఆస్పత్రిలో పనిచేస్తున్న శానిటేషన్ సెక్యూరిటీ సిబ్బంది నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సీఐటీయూ జిల్లా నాయకుడు జి శివప్రసాద్, కౌలు రైతు సంఘం జిల్లా నాయకుడు జి లక్ష్మీపతి ఆధ్వర్యంలో ఆస్పత్రి సిబ్బందితో ఆదివారం సమావేశం నిర్వహించారు. నూతన కమిటీ అధ్యక్ష, కార్యదర్శులుగా శ్రీనివాసులు, భవానీ, కమిటీ సభ్యులుగా ప్రసాద్, చంద్ర, పుష్పకుమారి, ఉమామహేశ్వరి, జ్యోతి, అంకమ్మ, గంగాధర్, సుకన్య, వెంకటలక్ష్మి, జయమ్మ తదితరులు ఎంపికయ్యారు. నూతన కమిటీని సీపీఎం, సీఐటీయూ నాయకులు నాగయ్య, హజరత్తయ్య, దేవేంద్రాజు తదితరులు అభినందించారు.

సంగీత నృత్యాలయంలో 'గజ్జపూజ'


శివకుమార శర్మ, తదితరులను సన్మానిస్తున్న దృశ్యం

ఆత్మకూరు: పట్టణంలోని శ్రీభారతి సంగీత నృత్య విద్యాలయంలో ఆరు నెలలుగా నృత్యంలో శిక్షణ పొందుతున్న చిన్నారులకు ఆదివారం గజ్జపూజ నిర్వహించారు. సంప్రదాయం ప్రకారం నృత్యం నేర్చుకున్న వారు తొలి ప్రదర్శన చేయాలంటే గజ్జ పూజ, కంకణధారణ నిర్వహించాల్సి ఉంటుంది. అందులో భాగంగా నిర్వాహకులు కె.అపర్ణ ఆధ్వర్యంలో శిక్షణ పూర్తి చేసిన 15 మంది చిన్నారులకు నటరాజ స్వామి విగ్రహం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి గజ్జపూజ చేసి (మువ్వలధారణ) కంకణాలు ధరింపజేసి తొలి నాట్య ప్రదర్శన నిర్వహించారు. శివాలయం అర్చకులు మేళ్లచెరువు శివకుమారశర్మ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. చిన్నారుల తల్లిదండ్రుల కేరింతల నడుమ నాట్య ప్రదర్శన దిగ్విజయంగా సాగింది. శివకుమార శర్మ చిన్నారులను ఆశీర్వదించారు. శివకుమార శర్మను నాట్యం నేర్పిన నాట్యాచార్యులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో కె.చక్రవర్తి, సంస్థ సభ్యులు పాల్గొన్నారు.